

వాసర వాసికెక్కేనా..?

బాసర ఆలయ అభివృద్ధికి నూతన సొబగులు కల్పించేందుకు ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. ఇప్పటికే రూ.50 కోట్లు మంజూరయ్యాయి. 8లో▸

డీఏవో పరీక్ష అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సులు

నిర్మల్‌టౌన్‌: ఈ నెల 26న టీఎస్‌ పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే డివిజన్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌ (డీఏవో) పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం నిర్మల్‌ నుంచి కరీంనగర్‌, నిజామాబాద్‌, హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్‌ సాయన్న తెలిపారు. ఉదయం 3:30 గంటల నుంచి బస్సులు నడుపుతామని పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం **36.3 / 17.4**

ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ వేడి కొనసాగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది.

న్యూస్‌రీల్‌

వధూవరులను ఆశీర్వదించిన మంత్రి



నిర్మల్‌ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.కర్ణకుమార్‌ కూతురు వివాహం హైదరాబాద్‌లో గురువారం జరిగింది. వివాహానికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. – నిర్మల్‌టౌన్‌

విధులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న కలెక్టర్‌

భైంసా: విధులు నిర్లక్ష్యం చేస్తే ఎంతటివారైనా సహించేదిలేదని కలెక్టర్‌ వరుణ్‌రెడ్డి స్పష్టం చేశారు. భైంసా ఏరియా ఆసుపత్రిని గురువారం సందర్శించారు. ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌ కాశీనాథ్‌, ఇతర వైద్యులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని అన్నివార్డుల్లో పర్యటించారు. అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి విభాగం, ఆపరేషన్‌ థియేటర్‌, అత్యవసర విభాగం, జనరల్‌ వార్డులకు వెళ్లి అక్కడ ఉన్న రోగులు, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి భవనం, గదుల పరిస్థితిని పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సకాలంలో విధులకు హాజరుకావాలని పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు.

వాటోలిలో పంచాయతీరాజ్‌ డిప్యూటీ కమిషనర్‌ పర్యటన



గ్రామంలో పర్యటిస్తున్న అధికారులు

భైంసారూరల్‌: మండలంలోని వాటోలి గ్రామాన్ని పంచాయతీరాజ్‌ శాఖ డిప్యూటీ కమిషనర్‌ రామారావు గురువారం పరిశీలించారు. నేషనల్‌ పంచాయతీరాజ్‌ అవార్డు జాబితాలో చోటు సంపాదించిన వాటోలి గ్రామంలో సిబ్బంది పనితీరు, పరిశుభ్రత, మొక్కల పెంపకం తదితర విషయాలను పరిశీలించారు. గ్రామంలో నర్సరీ, పల్లెప్రకృతివనం, డంపింగ్‌యార్డు, తెలంగాణ క్రీడాప్రాంగణం, వైకుంఠధామాన్ని సందర్శించారు. సీసీ రోడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్‌ నిఖిత, డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, నాయకులు సచిన్‌, గ్రామస్తులు ఉన్నారు.

వాహనాలు తనిఖీ చేసిన ఏఎస్పీ



వాహనదారుడితో మాట్లాడుతున్న ఏఎస్పీ

ముధోల్‌: మండలంలోని తరోడా గ్రామం వద్ద ఏఎస్పీ కాంతిలాల్‌ పాటిల్‌ గురువారం వాహనాలు తనిఖీ చేశారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ ధరించాలని సూచించారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దని పేర్కొన్నారు. ట్రాఫిక్‌ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని తెలిపారు. ఏఎస్పీ వెంట ముధోల్‌ సీఐ వినోద్‌రెడ్డి, పోలీస్‌ సిబ్బంది ఉన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్‌: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం గ్లోబల్‌ సూపర్‌ స్పెషాలిటీ హైదరాబాద్‌ సహకారంతో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్‌.లింగన్న తెలిపారు. జిల్లా పెన్షనర్ల సంఘ భవనంలో ఉదయం 10:30 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు. పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు చేసిన తర్వాత అవసరమైన వారికి ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు.

మళ్లీ 'అడవి దొంగలు'!



ఇలా.. టేకు చెట్లను నరికేసింది ఎక్కడో మారుమూల అటవీ ప్రాంతంలో కాదు. మామడ మండలం దిమ్మదుర్తి–ఖానాపూర్‌ మండలం ఎగ్బాల్‌పూర్‌ మధ్యలో ఎన్‌హెచ్‌ 61 రోడ్డు పక్కనే.. ఎఫ్‌ఆర్‌వో కార్యాలయానికి సమీపంలోనే.. అటవీ అధికారులు ఉంటారన్న ఆందోళన, ఫారెస్ట్‌ చెక్‌పోస్టు ఉంటుందన్న భయం ఏమాత్రం లేకుండా చెట్టు నరికేశారంటే ఇది పెద్ద స్మగ్లర్ల పనిగా అర్థమవుతోంది.



ఈ కారులోని కలప జనవరి 23న దస్తురాబాద్‌ మండలం మున్యాల్‌ వద్ద పట్టుకున్నది. దీని విలువ రూ.65,934. జన్నారంవైపు నుంచి కారులో కలపను తీసుకుని వస్తుండగా కడెం మండలం పాండ్వాపూర్‌ వద్ద అటవీశాఖ అధికారులు ఆపేందుకు ప్రయత్నించారు. సదరు కారు మున్యాల్‌ వైపు మళ్లించడంతో అటవీశాఖ అధికారులు వెంబడించి పట్టుకున్నారు. ఫిబ్రవరి 20న కూడా ఇదే పాండ్వాపూర్‌ చెక్‌పోస్టు వద్ద రూ.40,279 విలువ చేసే కలపను కారులోనే తరలిస్తుండగా పట్టుకున్నారు.



దిమ్మదుర్తి వద్ద కొట్టేసిన టేకు చెట్లు



ఈనెల 20న పట్టుకున్న కలప దుంగలు

- పచ్చని చెట్లపై గొడ్డలి వేటు
- రోడ్ల పక్కనే వనమేధం..
- పట్టపగలే అక్రమంగా కలప రవాణా

నిర్మల్‌: జిల్లాలోని పచ్చని అడవుల్లో మళ్లీ దొంగలు పడ్డారు. ఏపుగా పెరిగిన టేకు చెట్టు కనిపిస్తే గొడ్డలి వేటు వేస్తున్నారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో టేకు చెట్లను కొట్టేస్తూ, దుంగలుగా మార్చేస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా దర్జాగా కార్లు, ఇతర వాహనాల్లో తరలించేస్తున్నారు. ఎంతమంది అధికారులు ఉన్నా, ఎన్ని చెక్‌పోస్టులు పెట్టినా కలప చేరాల్సిన చోటికి చేరుతుండటం విస్మయ పరుస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే మళ్లీ నాలుగేళ్ల కిందటి కథే పునరావృతమవడం ఖాయమంటున్నారు పర్యావరణ పరిరక్షకులు. మొదట్లోనే అరికట్టపోతే కలప స్మగ్లర్లు విజృంభిస్తారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

మళ్లీ కోత షురూ..!

ఈనెల రెండోవారంలో దిమ్మదుర్తి–ఎగ్బాల్‌పూర్‌ ప్రాంతంలో రోడ్డు పక్కన దాదాపు 15–16 టేకు చెట్లను కొట్టేశారు. ఎప్పుడూ రద్దీగా ఉండే ఎన్‌హెచ్‌ 61 పక్కన, అటవీశాఖ అధికారుల నిఘా ఎక్కువగా ఉండే ప్రాంతం నుంచి ఈ స్థాయిలో కలపను దొంగిలించడం గమనార్హం. బడా స్మగ్లర్లు యంత్రాలతో చెట్లను కోసి భారీ వాహనాల్లో తరలించినట్లు అర్థమవుతోంది. ఇంత దర్జాగా కొట్టుకెళ్లిన చెట్లకు సంబంధించిన ఆనవాళ్లు కూడా ఇప్పటి వరకు దొరకలేదు. ఈ ఘటనపై అటవీశాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. చాలా ఏళ్ల తర్వాత ఈస్థాయిలో జిల్లాలో చెట్లను నరికివేయడం ఇక్కడే వెలుగులోకి వచ్చింది. ఇంకా ఇలాంటివి వెలుగులోకి రాకుండా ఎన్ని జరిగి ఉంటాయోనన్న ఆరోపణలూ ఉన్నాయి. పోడు కోసం చేసి ఉంటారని కొంతమంది అటవీ అధికారులు చెబుతున్నా నమ్మశక్యంగా లేదు.

నాలుగేళ్ల క్రితం..

జిల్లాలో అలాగే జిల్లా మీదుగా నాలుగేళ్ల క్రితం వరకు యథేచ్ఛగా చెట్ల నరికివేత, కలప అక్రమ రవాణా జోరుగా సాగింది. ప్రధానంగా జిల్లా మీదుగా నిజామాబాద్‌, హైదరాబాద్‌, కరీంనగర్‌, మహారాష్ట్ర ప్రాంతాలకు కలపను తరలించారు. 2019, జనవరి 19న ఆదిలాబాద్‌ జిల్లా నుంచి నిజామాబాద్‌ తరలిస్తున్న రూ.16.52 లక్షల విలువైన కలపను నిర్మల్‌ పోలీసులు పట్టుకోవడంతో అక్రమదందా బయటపడింది. అడవిని ఓ పద్ధతిగా, అందరూ కలిసి ఎలా కొల్లగొడుతున్నారో, ఇందులో ఎంతమంది ఇంటి దొంగలు ఉన్నారో కథంతా బయటకు రావడం అప్పట్లో సంచలనమైంది. నిజామాబాద్‌కు చెందిన అప్పటి ఏఆర్‌ ఎస్సై, ఉట్నూర్‌ ఎఫ్‌ఎస్‌వో, ఇచ్చోడ సీఐ, నేరడిగొండ ఎస్సైతోపాటు చెక్‌పోస్టుల్లో డ్యూటీ చేసిన అధికారులు, సిబ్బంది ఇందులో భాగస్వాములుగా తేలింది. దీనిని సర్కారు సీరియస్‌గా తీసుకోవడంతో వీరందరూ అప్పట్లోనే సస్పెండ్‌ అయ్యారు. ఈ ఘటనతో ఏకంగా జిల్లాకు చెందిన అటవీశాఖ జిల్లా ఉన్నతాధికారినే ప్రాధాన్యత లేని చోటికి బదిలీ చేశారు. మళ్లీ ఇప్పుడు వనమేధం మొదలైనట్లు కనిపిస్తోంది. ఇటీవల చెట్లను నరికివేయడం, కార్లలో తరలిస్తూ పట్టుబడటం చూస్తుంటే ఈ అనుమానమే కలుగుతోంది.

విచారణ చేస్తున్నాం..

దిమ్మదుర్తి–ఎగ్బాల్‌పూర్‌ మధ్యలోని అటవీప్రాంతం నుంచి కొట్టుకెళ్లిన టేకు కలపకు సంబంధించిన ఘటనపై విచారణ కొనసాగుతోంది. పోలీసులకు కూడా దీనిపై ఫిర్యాదు చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– పుండలీక్‌, ఎఫ్‌ఆర్‌వో, మామడరేంజ్‌

విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలి

- ఎస్‌సీఈఆర్టీ రాష్ట్ర పరిశీలకుడు చంద్రశేఖర్‌రెడ్డి



పాఠశాలను తనిఖీ చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నిర్మల్‌ రూరల్‌/లక్ష్మణచాంద: విద్యార్థులు పరీక్షలకు మానసికంగా సంసిద్ధం కావాలని ఎస్‌సీఈఆర్టీ రాష్ట్ర పరిశీలక బృందం సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని ఆసరా కాలనీ ఉన్నత పాఠశాల, మండలంలోని రత్నాపూర్‌ కాండ్లీ, కొండాపూర్‌ పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తున్న తీరును, లక్ష్మణచాంద మండలంలోని పలు పాఠశాలలను డీఈవో రవీందర్‌రెడ్డితో కలిసి గురువారం సందర్శించారు. లక్ష్మణచాంద కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలంటే భయాన్ని వీడాలని సూచించారు. ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్‌ పగడ్బందీగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సాయంత్రం సమయంలో స్నాక్స్‌ ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీచర ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, మల్లాపూర్‌లోని ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్‌ పరీక్షల నిర్వహణ, హాజరు పరిశీలించారు. ప్రతీ విద్యార్థి ప్రీఫైనల్‌ పరీక్షలకు హాజరు కావాలన్నారు. ఈ పరీక్షలతో వార్షిక పరీక్షలపై అవగాహన కలుగుతుందని తెలిపారు. ప్రశ్నపత్రం కూర్పు, ప్రశ్నల సరళి అర్థమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను పరీక్షించుకుని అవసరమైన ప్రణాళిక రూపొందించుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలన్నారు. పదో తరగతి విద్యార్థులను గ్రూపులుగా విభజించి ఒక్కో గ్రూపును ఉపాధ్యాయులు దత్తత తీసుకున్నారో లేదో తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం, సమాధానం పత్రాల మూల్యాంకనం, వారాంతపు పరీక్ష నిర్వహణకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. రాష్ట్ర పరిశీలన బృందం సభ్యులు నాగుల రవి, నారాయణవర్మ, కేజీబీవీ ఎస్‌వో నవిత, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నర్సయ్య, మాజిద్‌, విద్యారాణి పాల్గొన్నారు.

ధీ(బీ)మా ఏది?



లక్ష్మణచాందలో చెత్త సేకరిస్తున్న పంచాయతీ కార్మికులు

- పరేషాన్‌లో పంచాయతీ కార్మికులు
- కార్మికుడు మృతి చెందితే రోడ్డున పడుతున్న బాధిత కుటుంబాలు
- బీమా కొనసాగించాలని డిమాండ్‌

పంచాయతీ కార్మికుల వివరాలు

జిల్లాలోని మండలాలు	19
గ్రామపంచాయతీలు	396
కార్మికుల సంఖ్య	1,600

లక్ష్మణచాంద: గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నూతన పంచాయతీరాజ్‌ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. గ్రామాలను పరిశుభ్రంగా, స్వచ్ఛతతో ఉంచడంలో గ్రామపంచాయతీ కార్మికుల పాత్ర కీలకం. ఉదయం నిద్ర లేచిన నుంచి గ్రామాల్లోని రోడ్లపై ఉన్న చెత్త తొలగించడంతో పాటు నిరంతరం గ్రామాల్లోని మురుగు కాల్వలను శుభ్రం చేస్తూ స్వచ్ఛతగా ఉంచడంలో వీరు చేస్తున్న కృషి అంతాఇంతా కాదు. ఇలాంటి పంచాయతీ కార్మికులకు గతంలో బీమా కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం దానిని ఎత్తివేసింది. దీంతో పంచాయతీ కార్మి కుడు ఏదైనా కారణంతో మృతి చెందితే ఆ కుటుంబం రోడ్డున పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో జిల్లాలోని 1,600 మంది పంచా యతీ కార్మికుల కుటుంబాలు ధీమా కోల్పోయాయి.

గతంలో ఒక్కొక్కరికీ రూ.968

గతంలో జిల్లాలోని 396 గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల్లో బీమాకు అర్హులైన వారిని ప్రభుత్వం గుర్తించేది. ప్రభుత్వ నియమనిబంధనలు అనుసరించి ఒక్కొక్కరి పేరిట రూ.968 చొప్పున బీమా సంస్థకు ప్రీమియం చెల్లించింది. దీంతో కార్మికులు ఏ కారణంతో మరణించినా వారి కుటుంబానికి రూ.2లక్షలు సాయం అందే అవకాశం అందేది. దీంతో సాయం పొందిన కుటుంబాలకు కొంత ఊరటగా ఉండేది.

ధీమా కోల్పోయిన కార్మికులు

జిల్లాలోని 19 మండలాల్లోగల 396 గ్రామపంచాయతీల్లో 1,600 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరు గతంలో బీమాకు అర్హులుగా ఉండేవారు. కానీ.. ప్రస్తుతం ప్రభుత్వం బీమా సౌకర్యం తీసివేయడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి తాము చనిపోతే తమ కుటుంబాలు రోడ్డున పడాల్సిందేనా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జిల్లాలోని వివిధ గ్రామపంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు తిరిగి బీమా సౌకర్యం కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వం పునరాలోచించాలి



జిల్లాలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు ఎలాంటి బీమా సౌకర్యం లేదు. దురదృష్టవశాత్తు ఏ కారణంతోనైనా మేము మరణిస్తే మా కుటుంబాలు రోడ్డున పడతాయి. ప్రభుత్వం దీనిపై పునరాలోచించాలి.

– భీమన్న, పంచాయతీ కార్మికుడు, లక్ష్మణచాంద

బీమా కొనసాగించాలి



గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా ఉంచడంలో కీలక పాత్రవహిస్తున్న గ్రామపంచాయతీ కార్మికులపై ప్రభుత్వం చిన్నచూపు చూడడం తగదు. గతంలోలాగా మళ్లీ బీమా సౌకర్యం కల్పించాలి. మా కుటుంబాలను ఆదుకోవాలి.

– ఉదయ్‌కిరణ్‌, పంచాయతీ కార్మికుడు, పీచర

కార్మికులను ఆదుకునేలా చర్యలు



గతంలో పంచాయతీ కార్మికులకు బీమా ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం ఎత్తివేసింది. జిల్లాలోని కొన్ని పంచాయతీల కార్యదర్శులు తమ పరిధిలోని కార్మికులతో ప్రైవేట్‌గా ఏడాదికి రూ.330 కట్టించినట్లు తెలుస్తోంది. త్వరలోనే జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించి పంచాయతీ కార్మికులకు కనీసం ప్రైవేట్‌గానైనా బీమా కట్టించి ఆదుకునేలా చర్యలు చేపడతాం.

– శ్రీలత, డీపీవో, నిర్మల్‌

పేదింటి పెళ్లికి అండగా ప్రభుత్వం



పట్టా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్‌

భైంసారూరల్‌: పేదింటి అమ్మాయి పెళ్లికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముధోల్‌ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. భైంసా మండల పరిషత్‌ కార్యాలయం ఆవరణలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ లబ్ధిదారులకు గురువారం చెక్కులను కలెక్టర్‌ వరుణ్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఇళ్ల పట్టాలు జారీ అయిన వారికి వాటిని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ నిరుపేద కుటుంబాల్లో ఆడపిల్ల పెళ్లికి ఏ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడకూడదని కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ పథకాలు ప్రారంభించారని తెలిపారు. కల్యాణలక్ష్మి పథకంలో 85 మందికి, షాదీముబారక్‌ కింద 222 మంది కి చెక్కులు పంపిణీ చేశారు. జీవో.58 ప్రకారం భైంసా పట్టణంలోని 660 మంది, కుభీర్‌ మండలంలోని 24 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ పట్టాలను అందించారు.

గుండేగాం సందర్శన..

మండలంలోని ముంపు గ్రామమైన గుండేగాం గ్రామాన్ని కలెక్టర్‌ వరుణ్‌రెడ్డి గురువారం సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగితెలుసుకున్నారు. అక్కడి నుంచి డబుల్‌ బెడ్‌రూం ఇళ్లలో ఉంటున్న గుండేగాం వాసులతో మాట్లాడారు. పునరావాసానికి చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ రాంబాబు, ఆర్డీవో రవికుమార్‌, భైంసా, కుభీర్‌ తహసీల్దార్లు చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వంబర్‌, కౌన్సిలర్‌ చందులాల్‌, నాయకులు కాల్‌గడ్డవార్‌ సూర్యనారాయణ, సాహెబ్‌రావు, సొలంకి భీంరావు, గణేశ్‌, అమీర్‌, రాజేశ్వర్‌, తోట రాము తదితరులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్‌ వరుణ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌

నిర్మల్‌ చైన్‌గేట్‌: ధరణి పెండింగ్‌ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్‌ వరుణ్‌రెడ్డి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో ధరణి, డబుల్‌ బెడ్‌రూం, ఇరిగేషన్‌, మిషన్‌ భగీరథ పనులపై అదనపు కలెక్టర్‌ రాంబాబుతో కలిసి సమీక్ష నిర్వహించారు. భూసేకరణకు సంబంధించిన సర్వే పనులు, తహసీల్దార్ల వద్ద ఉన్న పెండింగ్‌ పనులు, ఆయా శాఖల ద్వారా వచ్చిన దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. డబుల్‌ బెడ్‌ రూంలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వాటికి లబ్ధిదారులను గ్రామసభ నిర్వహించి ఎంపిక చేయాలని సూచించారు. జిల్లాలో స్థానిక అవసరాలకు ఇసుకకు పాత పద్ధతి అవలంబించాలని తెలిపారు. సమీక్షలో డీఆర్వో లోకేష్‌, ఆర్డీవో రవికుమార్‌, అధికారులు పాల్గొన్నారు.

బ్లడ్‌ క్యాన్సర్‌నూ జయించవచ్చు



క్యాన్సర్‌ జయించిన వారిని చూపుతున్న వైద్యుడు

నిర్మల్‌: సకాలంలో నిర్ధారించి, సరైన వైద్యాన్ని అందిస్తే ప్రాణాంతక బ్లడ్‌ క్యాన్సర్‌నూ జయించవచ్చని ప్రముఖ ఆంకాలజిస్ట్‌ గణేశ్‌ జైశెట్వార్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఆర్‌ ఆస్పత్రిలో బ్లడ్‌ క్యాన్సర్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధిపై అవగాహన కలిగి ఉండడం అత్యంత ముఖ్యమన్నారు. ఆరునెలల చిన్నారుల నుంచి 80 ఏళ్ల వృద్ధుల వరకూ బ్లడ్‌క్యాన్సర్‌ నయమైందన్నారు. ఎముకమజ్జ ట్రాన్స్‌ప్లాంట్‌ విజయవంతం చేసిన పేషెంట్ల గురించి వివరించారు. బ్లడ్‌క్యాన్సర్‌ నివారణలో ఇమ్యునోథెరపీ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని తెలిపారు. గ్రామీణులు బ్లడ్‌క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతోనే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో వైద్యులు ప్రశాంత్‌షిండే, శోభారాణి, ప్రతిభారెడ్డి, సుభాష్‌రావు, ఎంపీఎస్‌.రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అథ్లెటిక్స్‌ పోటీలు

నిర్మల్‌ రూరల్‌: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో గురువారం అథ్లెటిక్స్‌ పోటీలు నిర్వహించారు. అండర్‌ 14, 16, 18, 20 విద్యార్థినీ విద్యార్థులు మొత్తం 120 మంది పరుగు పందెంలో పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారు ఈనెల 25, 26 తేదీల్లో హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్‌ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మనాభంగౌడ్‌, శామ్యూల్‌ తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ భీమారావు మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించి జిల్లా పేరు నిలబెట్టాలన్నారు. పీఈటీలు సత్తయ్య, డేవిడ్‌, వెన్నెల, పెంటన్న, సుజాత, రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

టోకెన్‌ తిప్పలు



బాసరలో శుక్రవారం ఇచ్చే టోకెన్ల కోసం గురువారమే రైతుల నిరీక్షణ



భైంసా పీఏసీఎస్‌ కార్యాలయం వద్ద టోకెన్ల కోసం బారులుతీరిన రైతులు

ఆరుగాలం శ్రమించి పండించిన శెనగ పంటను అమ్ముకునేందుకు రైతులకు తిప్పలు తప్పడం లేదు. ప్రస్తుతం పంట కోతలు పూర్తయ్యాయి. ప్రభుత్వం పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది. టోకెన్ల కోసం అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. టోకెన్లు ఎప్పుడు ఇస్తారో తెలియక కార్యాలయం తెరుచుకోకముందే క్యూ కడుతున్నారు. భైంసాలోని మిర్జాపూర్‌ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద, బాసరలో గురువారం రైతులు టోకెన్ల కోసం ఇలా బారులు తీరి కనిపించారు. శుక్రవారం టోకెన్లు ఇస్తారని తెలియడంతో గురువారమే రైతులు చెప్పులు, ఖాళీ వాటర్‌ బాటిళ్లు, ప్లాస్టిక్‌ కవర్లు, బండరాళ్లు ఉంచి వెళ్లారు. – భైంసా/భైంసాటౌన్‌

వాసర వాసికెక్కేనా..?

- యాదాద్రిలా మారనున్న బాసర (వాసర)
- త్వరలోనే ఆలయ పునర్నిర్మాణం
- శృంగేరి పీఠాధిపతుల మార్గదర్శనం
- మంత్రితో ఆలయ బృందం సమీక్ష

భైంసా: బాసర(వాసర) ఆలయ అభివృద్ధికి నూతన సొబగులు కల్పించేందుకు ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. కొన్నిరోజులుగా దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చొరవతో బాసర ఆలయ బృందం అభివృద్ధి, బృహత్ ప్రణాళికలో మార్పులు, చేర్పులపై కసరత్తు ప్రారంభించింది. రెండు దశాబ్దాలుగా అభివృద్ధికి దూరమైన బాసర ఆలయ పునర్నిర్మాణంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. ఏకైక సరస్వతీ క్షేత్రమైన బాసర ఆలయానికి సంబంధించి ఇప్పటికే రూ.50కోట్ల నిధులు మంజూరైనట్లు ప్రభుత్వం ప్రకటించగా బాసర రూపురేఖలు యాదాద్రిలా మారిపోనుందనే భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

శృంగేరికి బాసర బృందం....

ఆలయాల అభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. నిధులు విడుదల చేసేందుకు సీఎం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారనే సంకేతాలు వినిపిస్తున్నాయి. యాదాద్రి తరహాలో దక్షిణ భారత దేశంలోనే ప్రసిద్ధిచెందిన బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో శృంగేరి పీఠాధిపతుల మార్గదర్శనం, ఆగమ నిర్దేశం మేరకు బాసర ప్రధాన ఆలయ పునర్నిర్మాణ ప్రక్రియ జరగాలని సీఎం కేసీఆర్ సూచించినట్లు సమాచారం. దీంతో దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశాలను సారం బాసర ఆలయ బృందం మూడు రోజుల క్రితం కర్నాటకలోని శృంగేరి బయలుదేరింది. అక్కడ శృంగేరి పీఠాధిపతి విధుశేఖరభారతి స్వామి కలిసి ఆలయ పరిస్థితిని పునర్నిర్మాణంలో మార్పులు, చేర్పులు, ఇతర విషయాలపై సలహాలు తీసుకున్నారు. ఇప్పుడున్న గర్భాలయాన్ని కృష్ణ శిలలతో అద్భుతంగా నిర్మించడం, సరస్వతీ అమ్మవారి దర్శన అనంతరం పక్కనే ఉన్న మహాలక్ష్మీ అమ్మవారి ప్రతిమ కనిపించేలా ప్రత్యేక నిర్మాణం చేపట్టనున్నారు. మహాంకాళి అమ్మవారి ప్రతిమ వెనుక ప్రాకార మండపం ప్రాకారం లోపల శివాలయ పునః ప్రతిష్ఠ, దత్తాత్రేయ స్వామి వారి స్థల మార్పిడి, ఆలయానికి నలుదిక్కుల రాజగోపురాల నిర్మాణం అనివేటి మండప నిర్మాణం, ధ్వజ స్తంభం ఏర్పాటు, ఆలయ ప్రాంగణంలోనే యాగశాల వంటి వాటిపై శృంగేరి పీఠాధిపతి పలు మార్పులు, చేర్పులకు ఆలయ బృందానికి సూచనలు చేశారు.



శృంగేరి పీఠాధిపతితో ఆలయ నమూనాపై చర్చిస్తున్న బాసర బృందం

మంత్రితో సమావేశం...

శృంగేరి పీఠం నుంచి తిరిగి వచ్చిన బాసర బృందం గురువారం రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని నిర్మల్ కలిశారు. శృంగేరిలో పీఠాధిపతి సూచించిన పలు విషయాలను మంత్రికి తెలియజేశారు. అందుకు అనుగుణంగానే ఆలయ పునర్నిర్మాణ ప్లాన్‌ను సిద్ధం చేయాలని మంత్రి తెలిపారు. క్యూ కాంప్లెక్స్, కార్య నిర్వాహణ అధికారి కార్యాలయం, దాతల సాయంతో మరిన్ని వసతి గదులు, ఇతర నిర్మాణాలకు సంబంధించి ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. బాసర మాస్టర్ ప్లాన్‌ను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లిన తర్వాత పనులు చేపడుతామని మంత్రి వెల్లడించారు.

ఇప్పుడైనా జరగాలని...



బాసర ఆలయం

ఎన్నోఏళ్లుగా బాసర ఆలయ అభివృద్ధి కోసం అంతా ఎదురుచూస్తున్నారు. ఇటీవలే సీఎం కేసీఆర్ కొండగట్టుకు రూ. వెయ్యి కోట్లైనా వెచ్చించి పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే యాదాద్రి పనులు పూర్తయ్యాయి. భద్రాచలం, వేములవాడ ఆలయాలకు నిధులు ఇచ్చారు. ఇప్పటికైనా అమ్మవారి ఆలయ అభివృద్ధి చేయాలని అంతా కోరుతున్నారు.

శృంగేరి పీఠాధిపతిని కలిశాం

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సూచన మేరకు బాసర ఆలయ బృందంతో శృంగేరి వెళ్లి పీఠాధిపతి విధుశేఖరభారతి స్వామిని కలిసి నమూనాలు చూయించాం. చేపట్టే పనులు ఇతర విషయాలపై పీఠాధిపతి పలు సూచనలు ఇచ్చారు. గురువారం దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసి పీఠాధిపతి ఇచ్చిన సూచనలను ఆయన దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలోనే బాసర ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి.

– విజయరామారావు, ఆలయ ఈవో

క్లుప్తంగా

ఏఐసీసీ సభ్యుడిని కలిసిన దీక్షిత్‌రావు పాటిల్



జానారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పాటిల్

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన యువ నాయకుడు సిందే దీక్షిత్ రావు పాటిల్ ఏఐసీసీ సభ్యుడిగా నియమితులైన మాజీ మంత్రి జానారెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐసీసీ సభ్యుడు జానారెడ్డి ముథోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. యువత చేతిలోనే రాష్ట్ర భవిష్యత్ ఆధారపడి ఉందని, యువకులు చైతన్యవంతులై రాజకీయంలోకి రావాలని సూచించినట్లు దీక్షిత్ పాటిల్ తెలిపారు.

బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జిని కలిసిన జిల్లా నాయకులు



తరుణ్‌ఛుగ్‌తో జిల్లా నాయకులు

నర్సాపూర్(జి): బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్, రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ని గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో జిల్లా నాయకులు వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని, పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి, ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి, బీజేపీ జిల్లా మోర్చా మహిళా ఉపాధ్యక్షురాలు అలివేలి మంగ, జిల్లా ప్రయాణ కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు రవీందర్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి భుపేందర్ ఉన్నారు.

హైకోర్టు న్యాయవాది కుమారుడి ఆత్మహత్య

చెన్నూర్: పట్టణానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీరాంభట్ల శరత్‌కుమార్ కుమారుడు రాజీవ్ శర్మ (29) మంగళవారం హైదరాబాద్‌లోని తన స్వగృహంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. రాజీవ్ శర్మ బెంగళూర్ హైకోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం చెన్నూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాండూర్(బెల్లంపల్లి): తాండూర్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో గురువారం తెల్లవారుజామున రైలు ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు బెల్లంపల్లి జీఆర్పీ అవుట్ పోస్టు హెడ్‌కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. మంచిర్యాల నుంచి బల్లార్షా వైపు వెళ్తున్న గూడ్స్ రైలు తెల్లవారుజామున 1.40 గంటల ప్రాంతంలో ఢీకొట్టింది. మృతుడు బ్లాక్ అండ్ వైట్ కలర్ ఆఫ్ టీ షర్ట్, లైట్ ప్యారెట్ కలర్ షాట్ ధరించి ఉన్నాడు. అతని వద్ద రెడ్, బ్లూకలర్ బ్లాంకెట్లు ఉన్నాయి. మృతదేహాన్ని బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసిన వారు 9440900792 నంబర్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామ శివారులో పేకాటాడుతున్న ఏడుగురిని గురువారం పట్టుకున్నట్లు ఎస్సై ఆర్ శంకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు నిర్మల్ సీసీఎస్ ఎస్సై రవి సిబ్బందితో కలిసి నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.34260 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఐదు వాహనాలు సీజ్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. పట్టుబడిన వారిలో పలు పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు ఉన్నట్లు సమాచారం.

గుడుంబా స్థావరాలపై దాడులు



ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య ఎదుట బైండోవర్

కడెం: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ఎక్సైజ్ అధికారులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని 500లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రవికుమార్ పేర్కొన్నారు. లక్ష్మిసాగర్ తండాకు చెందిన బానవత్ లత, లింగాపూర్ గ్రామానికి చెందిన కైరం లక్ష్మీ, చిన్నబెల్లాల్ గ్రామానికి చెందిన బానవత్ యమునలపై కేసు నమోదు చేసి ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



ఇంట్లో కాలిపోయిన సామగ్రి

- రూ.13.22 లక్షల ఆస్తినష్టం

తానూరు: మండలంలోని బెల్‌తరోడా గ్రామంలో గురువారం షార్ట్ సర్క్యూట్‌తో బాయి భోజన్నకు చెందిన ఇల్లు పూర్తిగా కాలిపోయింది. బాధిత కుటుంబ సభ్యులు, రెవెన్యూ అధికారుల వివరాల ప్రకారం... గురువారం ఉదయం భోజన్న కుటుంబ సభ్యులు శుభకార్యానికి హాజరయ్యేందుకు భైంసాకు వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. గమనించిన గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని నిత్యావసర సరుకులు, మూడున్నర తులాల బంగారం ఆభరణాలతో పాటు రూ.7లక్షల వరకు నగదు, ఎలక్ట్రికల్ సామగ్రి కాలిబుడిదైంది. ఈ ప్రమాదంలో రూ.13.22 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై విక్రమ్, ఆర్ఐ గంగాధర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆర్ఐ గంగాధర్ పంచనామ నిర్వహించారు. బాధిత కుటుంబీకులు రోధించిన తీరు పలువురిని కలిచివేసింది.



కాలిన వస్తువులు చూపుతున్న బాధితులు

లైంగికదాడి కేసులో ఒకరికి పదేళ్ల జైలు

- రూ.3వేల జరిమానా

ఆదిలాబాద్‌టౌన్: పెళ్లి చేసుకుంటానని యువతిని లొంగదీసుకొని లైంగికదాడికి పాల్పడిన ఒకరికి పదేళ్ల కఠినకారాగార జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ జిల్లా మొదటి అదనపు జడ్జి మాధవికృష్ణ తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి జి.పండరి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2021 ఏప్రిల్ 16న గాదిగూడ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి అడ శ్రీరామ్ లైంగికదాడికి పాల్పడ్డాడు. యువతి పెళ్లి చేసుకోవాలని కోరగా నిరాకరించాడు. దీంతో బాధితురాలు విషయాన్ని కుటుంబీకులకు తెలిపింది. కుటుంబ సభ్యులు గాదిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. పీపీ మధుకర్ 15మంది సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. ఈ మేరకు పైవిధంగా జడ్జి తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి తెలిపారు.

ఆ నలుగురికి.. మేమున్నామని..

- అన్నాచెల్లెళ్లకు సాయమందించేందుకు ముందుకు..
- నిత్యావసరాలు అందించిన బాలల సంరక్షణ అధికారులు
- నగదు సాయం చేస్తున్న దాతలు



వంటపాత్రలు, సరుకులు అందిస్తున్న దహెగాం మండల యువకులు

సాక్షి స్పందన

దహెగాం(సిర్పూర్): తల్లిదండ్రుల ప్రేమకు దూరమై అనాథలుగా మారిన అన్నాచెల్లెళ్లను ఆదుకోవడానికి మేమున్నామంటూ పలువురు దాతలు ముందుకొస్తున్నారు. ఆకలితో అలమటిస్తున్న ఆ గిరిజన బిడ్డలకు నిత్యావసర సరుకులు, వంటపాత్రలు, దుస్తులతో పాటు నగదు సాయం అందిస్తున్నారు. దహెగాం మండలం చౌక గ్రామానికి చెందిన సిడాం రాజు అతని చెల్లెళ్లు మమత, దీపిక, దివ్య పడుతున్న అవస్థలపై బుధవారం 'సాక్షి'లో 'అన్న పనిచేస్తేనే.. చెల్లెళ్ల కడుపు నిండేది' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. చిన్నారులకు రెండో రోజు కూడా దాతలు సాయం అందించేందుకు ముందుకొచ్చారు.

నిత్యావసరాలు అందజేత

అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్ ఆధ్వర్యంలో అన్నాచెల్లెళ్ల ఇంటికి వెళ్లి నిత్యావసరాలు అందజేశారు. అనాథలైన పిల్లలను ప్రభుత్వం ఆదుకునేందుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. దీప, దివ్యలను గురుకుల పాఠశాలలో చేర్పించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగురాలైన దివ్యకు పింఛన్ మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్స్ ప్రవీణ్‌కుమార్, జమున, సఖి సిబ్బంది శ్రీనిధి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూర్య, అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి పాల్గొన్నారు.

సాయమందిస్తున్న దాతలు

- దహెగాం మండల కేంద్రంతో పాటు, గిరవెల్లి, పంబాపూర్, మర్రిపల్లి, గ్రామాలకు చెందిన యువకులు వంట పాత్రలు, దుస్తులు, నిత్యావసరాలు, పాఠశాలకు వెళ్లే దీపిక, దివ్యకు స్కూల్ బ్యాగ్‌లు, వాటర్ బాటిళ్లు, పెన్నులు, నోట్ పుస్తకాలు, తదితర వస్తువులు అందజేశారు.
- ఖమ్మం జిల్లాకు చెందిన ఓ ఉద్యోగి రూ.10 వేల ఆర్థికసాయం చేశారు.
- నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన క్రాంతి అతని స్నేహితుల ద్వారా ఆరు నెలలపాటు నెలకు రూ.2 వేలు సాయమందించేందుకు ముందుకు వచ్చారు.
- నర్సాపూర్(జి)కి చెందిన ఉపాధ్యాయుడు నరేందర్ రూ.వెయ్యి అందించారు.
- దహెగాం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో దుస్తులు అందజేశారు. వారి ఇంటికి మరమ్మతు చేయించేందుకు మరికొంత మంది దాతలు ముందుకొచ్చారు.

రూ.9.20 లక్షల గంజాయి పట్టివేత

- నాలుగు సెల్ ఫోన్‌లు, రెండు కార్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని ఉట్నూర్ మీదుగా మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తుండగా మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 44పై గంజాయిని పట్టుకున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం మావల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసినా విలేకరుల సమావేశంలో నిందితులను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉట్నూర్ మండలానికి చెందిన మహమ్మద్ సద్దాం ఖాన్, రెహ్మాన్‌ఖాన్, పవార్ రాజు, రాథోడ్ శ్రీకర్, మహమ్మద్ సద్దాం హుస్సేన్, గావాలే తుకారాం, జన్నారం మండలం గొండుగూడకు చెందిన పూజారి వెంకటేష్, నిర్మల్ జిల్లాకు చెందిన మహేష్‌లు స్నేహితులు. వీరు జల్సాలకు అలవాటుపడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని గంజాయి అమ్మడం ప్రారంభించారు. ఆంధ్రా, ఒరిస్సా సరిహద్దుల్లో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో విక్రయించి లాభలు పంచుకుంటున్నారు. ఎప్పటిలాగే వారం క్రితం వీరు సీలేరు ప్రాంతం వెళ్లి కిలోకు రూ.4వేలు చెల్లించి 110 గంజాయి ప్యాకెట్లను కొనుగోలు చేశారు. ఉట్నూర్‌కు చెందిన తుకారాం ఇంట్లో వాటిని నిల్వ ఉంచారు. మూడు రోజుల తరువాత వెంకటేష్, సద్దాం హుస్సేన్, మహేష్‌లు కలిసి అందులోని 66 ప్యాకెట్లను మహారాష్ట్రలోని అమరావతికి తీసుకెళ్లి విక్రయించారు. అలాగే బుధవారం మిగిలిన 44 ప్యాకెట్లను విక్రయించేందుకు మహారాష్ట్రలోని పుసద్‌కు వెళ్తుండగా పక్కా సమాచారం మేరకు మావల పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. గుడిహత్నూర్ వైపు నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న రెండు కార్లను తనిఖీ చేసి అందులోని గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మహమ్మద్ సద్దాం హుస్సేన్, గావాలే తుకారాం, జన్నారం మండలం గొండుగూడకు చెందిన పూజారి వెంకటేష్, నిర్మల్ జిల్లాకు చెందిన మహేష్‌లు కారును వదిలి పారిపోయారు. మరో నలుగురు ఉట్నూర్ మండలానికి చెందిన మహమ్మద్ సద్దాం ఖాన్, రెహ్మాన్ ఖాన్, పవార్ రాజు, రాథోడ్ శ్రీకర్‌లను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారినుంచి రూ.9.20 లక్షలు విలువ గల 92 కిలోల 132 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే నాలుగు సెల్ ఫోన్లు, రెండు కార్లను సైతం స్వాధీనపర్చుకున్నారు. గంజాయిని పట్టుకున్న డీఎస్పీ ఉమేందర్, ఆదిలాబాద్ రూరల్ సీఐ రఘుపతి, సీసీఎస్ సీఐ, మావల ఎస్సైని ఎస్పీ అభినందించారు. సీఐ చంద్రమౌళి, ఎస్సై విష్ణువర్ధన్ ఉన్నారు.



గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి



గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన నిందితులు

బ్లడ్ క్యాన్సర్‌తో బాలుడి మృతి



పెద్ది జశ్వంత్(ఫైల్)

కడెం: మండలంలోని పాండ్వపూర్ గ్రామానికి చెందిన పెద్ది జశ్వంత్ (12)బ్లడ్ క్యాన్సర్‌తో మృతి చెందాడు. పాండ్వపూర్ గ్రామానికి చెందిన పెద్దిసునీత-రమేష్ దంపతుల ఏకైక కుమారుడు జశ్వంత్. మండలంలోని అంబారిపేట్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. కొంత కాలంగా బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్న జశ్వంత్‌కు తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఈ నెల 22న ఇంటికి వచ్చిన జశ్వంత్ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.

కారు, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న ముతేశ్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా జగన్నాథ్‌పూర్‌కు చెందిన ఆత్రం ముతేశ్ ఇంద్రవెల్లి మండలంలోని ఇంద్రాయిదేవిని దర్శించుకుని గురువారం రాత్రి బైక్‌పై తిరుగుప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో దంతన్‌పల్లి గ్రామం వద్ద ఎదురుగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ముతేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని ఆటోలో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కి రెఫర్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.







శునకాల భయం

నిర్మల్ జిల్లా కేంద్రంలో పట్టపగలు సైతం వీధుల్లో తిరగలేని దుస్థితి నెలకొంది. ఇక రాత్రి వేళల్లో గల్లీలో నడుచుకుంటూ వెళ్లాలంటే భయాందోళన చెందాల్సిన పరిస్థితి. వీధి కుక్కలు ఎక్కడి నుంచి వస్తాయో ఎలా దాడి చేస్తాయోనని స్థానికులు బైక్‌లపై వెళ్తున్నారు. అయినా ద్విచక్ర వాహనాన్ని వెంబడిస్తూ వాహనదారులకు వణుకుపుట్టిస్తున్నాయి. కుక్కల బెడద కేవలం జిల్లా కేంద్రంలోనే కాదు మండలాల్లోనూ నెలకొంది. కుక్కల సంఖ్య పెరుగుతున్నప్పటికీ బల్దియా అధికారులు మాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా కుక్కల బెడద తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్